క్లుప్తంగా

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ



హెచ్ఎం సుజాతకు కంప్యూటర్ బహూకరించిన పూర్వ విద్యార్థులు

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు శుక్రవారం 1999–2000 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు కంప్యూటర్ బహూకరించారు. ఇటీవల వీరంతా పాఠశాలలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ మేరకు వారు సమకూర్చిన కంప్యూటర్‌ను పాఠశాల హెచ్ఎం సీహెచ్ సుజాతకు అందజేశారు. పూర్వ ప్రధానోపాధ్యాయుడు జి.నాగేశ్వరరావు, విద్యా కమిటీ చైర్మన్ వై.బాబాజీ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. కాగా వారిని సర్పంచ్ మేడిది సరోజ, ఎంపీటీసీలు బెల్లంకొండ సత్యవతి, ఉండపల్లి సాయికుమారి అభినందించారు.

19న జాబ్ మేళా

మలికిపురం: మండలంలోని లక్కవరం మంగెన గురయ్య కళాశాల ప్రాంగణంలో ఈ నెల 19వ తేదీన జాబ్ మేళా జరుగుతుందని కరస్పాండెంట్ మంగెన వెంకట సత్య ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ప్రముఖ సంస్థలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని 25 సంవత్సరాల లోపు అభ్యర్థులు తమ విద్యార్హత పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని అన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మలికిపురం: మండలంలోని గుడిమెళ్లంకలో మండల పరిషత్ నుంచి మంజూరైన రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పనులు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు మేడిచర్ల రాము, నల్లి శివకుమార్, తిరుమల ఏసుబాబు, గవర్రాజు, కడలి వీవీ సత్యనారాయణ, చింతా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సివిల్ ర్యాంకర్ రమణికి సన్మానం

మామిడికుదురు: ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ పరీక్షల్లో 583వ ర్యాంకు సాధించిన ఈదరాడకు చెందిన యర్రంశెట్టి ఉమాశ్రీలక్ష్మీరమణిని బీజేపీ నేతలు శుక్రవారం సన్మానించారు. ఈదరాడలో రమణిని కలిసి ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. బీజేపీ జాతీయ కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్, మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ, రాష్ట్ర కోకోనట్ కన్వీనర్ గనిశెట్టి అరవింద్, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి వేగి వెంకటేశ్వరరావులు రమణిని అభినందించి ఆమె మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అభిలషించారు.

సుగర్ వ్యాధిగ్రస్తుడికి ఆర్థిక సాయం

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదిపాలెం శివారు అద్దాలపాలెంలో శుక్రవారం సుగర్ వ్యాధిగ్రస్తుడు కె.ధర్మరాజుకు వైద్య ఖర్చులకై కువైట్ కేంద్రంగా గల్ఫ్ గృహ కార్మికుల హెల్పింగ్ హ్యాండ్స్ ద్వారా రూ.10 వేల ఆర్థికసాయం చేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూపు మెంబర్ రాపాక ఆదాం ప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా పై మొత్తాన్ని ఎస్సై రాము చేతుల మీదుగా బాధితుడికి అందజేశారు. అరుణోదయ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నక్కా రామారావు, కార్యదర్శి నల్లి ప్రసాదరావు, ప్రతినిధులు పాటి శ్రీను, తాడి మోహన్‌బాబు, తాడి సహదేవ్, పాలపర్తి శేఖర్ పాల్గొన్నారు.

వెంకన్న నిత్యాన్నదానానికి విరాళం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కాట్రేనికోనకు చెందిన వి.వెంకట కామేశ్వరి రూ.10,116 విరాళం అందించినట్లు ఈఓ తెలిపారు. దాతకు ఆయన స్వామి చిత్రపటం అందజేశారు.

ముగిసిన కరాటే, యోగా శిక్షణ శిబిరం

రావులపాలెం: స్థానిక సత్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మే ఒకటో తేదీ నుంచి జూన్ 15 తేదీ వరకు జరిగిన ఉచిత సమ్మర్ క్యాంప్ కరాటే, యోగా శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. స్థానిక పార్కు వద్ద జరిగిన ముగింపు కార్యక్రమానికి ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, సీఆర్‌సీ స్పోర్ట్స్ డైరెక్టర్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. శిక్షణ పొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా ప్రతాలను అందజేశారు. కార్యక్రమంలో ద్వారంపూడి మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కిక్ బాక్సింగ్ సెక్రటరీ బూసి సామ్యూల్‌రాజు, ఈస్ట్ గోదావరి జిల్లా కిక్ బాక్సింగ్ సెక్రటరీ గుడాల రామప్రసాద్, వెంకటేష్, కోచ్ వీటి సంధ్యారాణి, సత్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

మట్టి ట్రాక్టర్ సీజ్

అంబాజీపేట: ఎటువంటి అనుమతులు లేకుండా పసుపల్లిలో మట్టిని అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను తహసీల్దార్ టి.మంగతాయారు శుక్రవారం రాత్రి సీజ్ చేశారు. అక్రమంగా మట్టి తరలిస్తున్నారని సమాచారం రావడంతో మట్టి టాక్టర్‌ను సీజ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ఆమె వెంట ఆర్ఐ ఇబ్రహీం ఉన్నారు.

సచివాలయాలు - సేవా నిలయాలు

- గ్రామాల్లోనే అందుబాటులో అన్ని సేవలు
- గ్రామ స్వరాజ్యానికి ప్రేరణ



మొగలికుదురు గ్రామ సచివాలయం

మామిడికుదురు: అన్ని ప్రభుత్వ శాఖల సేవలు, సంక్షేమ సేవలు ఒకే చోట అందుబాటులోకి తీసుకురావాలన్న సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ ప్రజలకు ఎంతో చేరువయింది. విలేజ్ సెక్రటేరియట్‌లుగా పిలిచే సచివాలయ వ్యవస్థ ద్వారా సీఎం జగన్ పరిపాలన వికేంద్రీకరణకు నాంది పలికారు. తద్వారా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి శ్రీకారం చుట్టారు. 2019 అక్టోబరు 2 గాంధీ జయంతి రోజున సచివాలయ వ్యవస్థను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. రెండు వేల జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేశారు. సచివాలయాల్లో 11 శాఖలను అందుబాటులోకి తీసుకువచ్చారు. మన రాష్ట్రంలో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచింది. గ్రామాల్లోనే అన్ని సేవలు అందుబాటులోకి రావడంపై ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. జగన్ పాలనకు జనం నీరాజనాలు పలుకుతున్నారు.

ఇంటికి ముంగిటకే సంక్షేమ పథకాలు

సచివాలయ వ్యవస్థలో భాగంగా 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను నియమించారు. దీనికి తోడు 12 శాఖలకు చెందిన ఉద్యోగులను నియమించారు. ఉద్యోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించారు. పింఛన్‌తో పాటు రేషన్‌తో సహా ప్రభుత్వం అమలు చేస్తున్న 28 రకాల సంక్షేమ పథకాలను ప్రజల చెంతకే తీసుకు వచ్చి ప్రజల వద్దకే పాలన అన్న నానుడిని అమలు చేసి చూపిస్తున్నారు. పింఛన్‌తో పాటు ఇతర సంక్షేమ పథకాలకు అర్హత ఉన్న వారిని గుర్తించి వారికి తక్షణం ప్రభుత్వ సహాయం అందించే విధంగా సరికొత్త పాలనకు అంకురార్పణ చేశారు.

సచివాలయాల్లో అందిస్తున్న సేవలు

ప్రభుత్వ సేవల కోసం గతంలో మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేంది. నేడు పరిస్థితిలో పూర్తిగా మార్పు వచ్చింది. సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలన్నీ ప్రజలకు దగ్గరయ్యాయి. నవరత్నాల్లో ప్రధానమైన పింఛన్ పంపిణీ, ఆధార్ అప్‌డేట్, అందరికీ ఇళ్లు, చేదోడు, చేయూత, మ్యుటేషన్, ఇళ్లు, భూముల రీసర్వే, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, పీఎం కిసాన్, రైతు భరోసా, దీర్ఘకాలిక రోగులకు, కిడ్నీ బాధితులకు పింఛన్ ఇలా ఎన్నో ఎన్నెన్నో సేవలు సచివాలయాల ద్వారా ప్రజలు పొందుతున్నారు. ఎవరి సిఫారసు లేకుండా అర్హతే ప్రామాణికంగా వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సేవలందిస్తున్నారు.

మామిడికుదురు మండల సమాచారం
గ్రామ పంచాయతీలు 18
సచివాలయాలు 22
వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులు 12,427
ఇంత వరకు పొందిన సహాయం రూ.30.36 కోట్లు
పింఛన్ పొందుతున్న లబ్ధిదారులు 9,965 మంది
నాలుగేళ్లలో పొందిన లబ్ధి 106.56 కోట్లు

సచివాలయాల ద్వారా అద్భుతమైన సేవలు



సచివాలయాల ద్వారా అద్భుతమైన సేవలందిస్తున్నారు. ఏ పని కావాలన్నా సచివాలయానికి వెళ్తే సరిపోతుంది. గడువులోగా ఆ పని మా గ్రామంలోనే పూర్తి చేస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఈ విధమైన పరిస్థితి లేదు. ఏ చిన్న పనికైనా మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేంది. ప్రభుత్వం తాజాగా తీసుకు వచ్చిన సంస్కరణలు మంచి ఫలితాలనిస్తున్నాయి.

– తవిటికి రాంబాబు, ప్రైవేటు కళాశాల అధ్యాపకుడు

ఎన్నో పథకాలు అందుతున్నాయి



మా కుటుంబానికి ప్రభుత్వం ద్వారా ఎన్నో సంక్షేమ పథకాలు అందుతున్నాయి. నేను ఎక్కడకు వెళ్లడం లేదు. వలంటీరు మా ఇంటికి వచ్చి వివరాలు తీసుకువెళ్లాడు. నేను నెల నెలా పింఛన్ అందుకుంటున్నాను. రైతు భరోసా వస్తోంది. నా భార్యకు డ్వాక్రా పింఛన్ వస్తోంది. మా మనవడికి అమ్మ ఒడి అందుతోంది. ఇవన్నీ కేవలం సచివాలయ వ్యవస్థ ద్వారానే సాధ్యమయ్యాయి.

– అన్వర్ అబ్దుల్ హుస్సేన్, మామిడికుదురు

సచివాలయాలతో ప్రజలకు మేలు



ప్రభుత్వం నుంచి ఏ సర్టిఫికెట్ తీసుకోవాలన్నా గతంలో మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. నేడు ఆ పరిస్థితి లేదు. మా గ్రామంలో సచివాలయంలో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. అన్ని శాఖల ఉద్యోగులు ఇక్కడ అందుబాటులో ఉంటున్నారు. మాకు అవసరమైన సర్టిఫికెట్లు అందజేస్తున్నారు. వలంటీర్లు ఇంటికి వచ్చి సంక్షేమ పథకాలు అందిస్తున్న తీరుతో ప్రజలు సంతోషంగా ఉన్నారు.

– వాసంశెట్టి సత్యనారాయణ, పెదపట్నంలంక

పారదర్శక పాలన అందిస్తున్నాం



లూటుకుర్రులో గడప గడపకూ మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: దళారుల ప్రమేయం లేకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకమైన పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం లూటుకుర్రులో జరిగింది. ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా అందుకున్న సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. అర్హతే ప్రామాణికంగా ఎవరి ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా అర్హులకే అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీకే దక్కిందన్నారు. ప్రజలు వాస్తవాలను గమనించి నిరంతరం ప్రజల సంక్షేమం కోరుకునే జగన్‌కి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అడబాల తాతకాపు, మండల జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, పీఏసీఎస్ చైర్మన్ యూవీవీ సత్యనారాయణ, గ్రామశాఖ అధ్యక్షుడు అడబాల చక్రపాణి, పార్టీ నేతలు చింతా రామకృష్ణ, తులా గోపాలకృష్ణ, అప్పన రామారావు, కడలి శేఖర్, బర్రే చిట్టిబాబు, కుసుమ పెరుమాళ్లకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి



ముంగండలో విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: విద్యాభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్ పని చేస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ముంగండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికల జూనియర్ ఇంటర్ తరగతులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం జగన్ అనేక పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. ఉత్తమ విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చిట్టిబాబు అన్నారు. దాతల సాయంతో సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను చిట్టిబాబు విద్యార్థినిలకు అందజేశారు. సర్పంచ్‌లు కుసుమ చంద్రకళ, వడలి కొండయ్య, ఎంఈఓ కోన హెలీనా, సొసైటీ కమిటీ చైర్మన్ బొడ్డు వెంకట సురేష్, ఎంపీటీసీ ముక్కామల భారతి, మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ చీకట్ల చంద్రరావు, హెచ్ఎం బండారు సుభాషిణి, నాయకులు కుసుమ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జెడ్పీ నిధులు రూ.5 లక్షలతో డ్రైనేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే చిట్టిబాబు శంకుస్థాపన చేశారు.

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: సీఎం జగన్ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసిందని మహాత్మాగాంధీ కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ పీఎస్ రాజు అన్నారు. శుక్రవారం స్థానిక మహాత్మాగాంధీ కళాశాల వద్ద విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రుద్రరాజు మురళీకృష్ణంరాజు తదితరులు ఉన్నారు.

అన్ని వర్గాలకూ ప్రభుత్వ సాయం



విభిన్న ప్రతిభావంతులకు వాహనాలు అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

మలికిపురం: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం అండగా ఉండి సాయం అందిస్తుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని సుమారు 10 మంది విభిన్న ప్రతిభా వంతులకు ప్రభుత్వం సమకూర్చిన వాహనాలను శుక్రవారం ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా సీఎం ముందుకు సాగుతున్నారని అన్నారు. ఏ అవసరం వచ్చినా నేనున్నాననే సీఎం జగన్ ఈ రాష్ట్రానికి ఉండడం ఈ రాష్ట్ర ప్రజల అదృష్టమని ఆయన అన్నారు. ఏ అవసరం వచ్చినా వెంటనే అధికారులకు తెలియజేసి తగిన సాయం పొందాలని కూడా ఎమ్మెల్యే రాపాక సూచించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ అడబాల వీర బ్రహ్మాజీరావు, తోటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట: ఈ నెల 23 నుంచి వచ్చే నెల 23వ తేదీ వరకూ నెల రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుసంధానంగా 'సురక్ష' కార్యక్రమాన్ని చేపడుతున్నామని తహసీల్దార్ టి.మంగతాయారు చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అంబాజీపేట మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ శుక్రవారం నిర్వహించారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ గ్రామ వలంటీర్, సచివాలయం సిబ్బంది, గృహసారథులు, ప్రజా ప్రతినిధులు వెళ్లి సమస్యలు ఆరా తీయాలన్నారు. గతంలో దరఖాస్తులను తిరస్కరిస్తే అందుకు కారణాలను 'సురక్ష'లో భాగంగా వారికి స్వయంగా చెప్పాలని ఆదేశించారు. ఏ ఒక్కరికీ సచివాలయ పరిధిలో సమస్యలు లేకుండా అధికారులు చూడాలన్నారు. మండల స్థాయిలో ఎంపీడీవో, డిప్యూటీ తహసీల్దార్‌తో 'సురక్ష' కమిటీని నియమించాలని కమిటీ ఎప్పుడు పర్యటిస్తుందో ముందే సమాచారం ఇవ్వాలన్నారు. ఒక ఊళ్లో ఒక రోజంతా గడుపుతూ ప్రజలకు అవసరమైన పత్రాలను అప్పటికప్పుడే అందిస్తూ వచ్చిన అభ్యర్థనలన్నీ మ్యాపింగ్ చేయాలని నిర్దేశించారు. ఈ అవకాశాన్ని మండలంలో ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించని అధికారులు మాకొద్దు



అంబాజీపేట మండల సమావేశంలో తహసీల్దార్‌కు సమస్యలు వివరిస్తున్న ప్రశాంత్, ఎంపీపీ

అంబాజీపేట: ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు మాకొద్దని మండల ఎంపీటీసీ సభ్యుల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్ అన్నారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ప్రశాంత్ మాట్లాడుతూ గ్రామాల్లో అర్హులైన వారు ఇళ్ల నిర్మించుకునేందుకు పొజిషన్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకోగా తిరస్కరిస్తున్నారని, ఎన్నిసార్లు కార్యాలయాల చుట్టూ తిరగాలని పేద ప్రజలపై ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని తహసీల్దార్ టి.మంగతాయారును నిలదీశారు. పొజిషన్ సర్టిఫికెట్ లేకపోవడంతో అర్హులైన వారు ఇల్లు నిర్మించుకునేందుకు మంజూరైన రుణాలు వెనక్కి వెళ్లిపోతాయని దానికి ఎవరు బాధ్యులని, స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే చెప్పినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ నిబంధనలకు వ్యతిరేకంగా పని చేయలేమన్నారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు ఇచ్చిన మాటలు ప్రకారం రూల్స్‌కి వ్యతిరేకంగా పనులు చేయలేమన్నారు. పుల్లేటికుర్రులో అక్రమంగా మట్టి తోలుతున్నారని మీ దృష్టికి తీసుకువస్తే స్పందించడం లేదని తహసీల్దార్‌ని సర్పంచ్ బాలరాజు ప్రశ్నించారు. లిఖిత పూర్వకంగా రాసి ఇస్తే పరిశీలన చేస్తామని తహసీల్దార్ చెప్పడంతో ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు కూడా రాసి ఇస్తేనే స్పందిస్తారా అని నిలదీశారు. ఆర్అండ్‌బీ జేఈ జి.రాజేంద్ర మాట్లాడుతూ గంగలకుర్రు మలుపులో ఉన్న పీర్మాయిపాలెం రోడ్డు జిల్లా పరిషత్‌కు చెందినదని దానిని ఆర్అండ్‌బీకి కన్వర్షన్‌కు పెట్టామని రాగానే రోడ్డును నిర్మిస్తామన్నారు. స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ ఎదురుగా మద్యం షాపు ఉండటంతో మందుబాబులు వీరంగం చేస్తూ రాత్రి సమయంలో బస్సు కోసం ఎదురు చూసే ప్రయాణికులను వేధిస్తున్నారని ఆర్టీసీ డిపో సిబ్బందికి ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు వివరించారు. సమావేశంలో జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, సూదాబత్తుల లక్ష్మీభార్గవి, సొసైటీ అధ్యక్షులు దొమ్మేటి సత్యమోహన్, నందుల ఆదినారాయణ, బొంతు శ్రీనివాసరావు, ఎంపీడీఓ డి.శ్రీనివాస్, ఈఓపీఆర్డీ బి.మమత, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కోలాహలం.. శ్రీనివాస కోలాటం



అంబాజీపేటలో కోలాట ప్రదర్శన చేస్తున్న మహిళలు

అంబాజీపేట: సనాతన సంప్రదాయాల్లో భాగమైన కోలాట నృత్యాన్ని వాడవాడలా వ్యాప్తి చేయడమే టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు లక్ష్యమని శ్రీహరే శ్రీనివాస కోలాట భజన మండలి గురువు బుడిగిన ఈశ్వర్ అన్నారు. అంబాజీపేట వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం రాత్రి తిరుమల తిరుపతి దేవస్థాన దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో గజ్జెపూజ, అనంతరం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత మంతా ఆధ్యాత్మిక కోలాహలంతో అలరాడింది. గురువు ఈశ్వర్ మాట్లాడుతూ గత రెండు నెలలుగా అంబాజీపేటలోని సుమారు 60 మంది మహిళలు, చిన్నారులకు కోలాట శిక్షణ ఇచ్చామని, శుక్రవారం గజ్జెల పూజ నిర్వహించామన్నారు. అమలాపురం రూరల్ మండలం, నల్లచెరువులో వేంచేసిన వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో తొలి ప్రదర్శన ఇస్తారన్నారు. ఇంతవరకు తాము 3 వేల ప్రదర్శనలు ఇచ్చామన్నారు. ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించడం వల్ల చిన్నతనం నుంచే వారిలో ఆధ్యాత్మిక కోలాహలం మొదలవుతుందన్నారు. కార్యక్రమంలో తాడిపర్తి వీరాస్వామి, గణేష్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి ఆర్థిక సహాయం

మామిడికుదురు: ఆపదలో ఉన్న నిరుపేదలకు గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవా సంస్థ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని రాష్ట్ర నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్ చెప్పారు. ఆదుర్రులో అనారోగ్యంతో బాధ పడుతున్న సంతానం లేని నిరుపేద వృద్ధ దంపతులకు సేవా సంస్థ ద్వారా వైద్య సహాయం నిమిత్తం రూ.22 వేల సహాయం అందించామని సంస్థ అధ్యక్షుడు కట్టా భాస్కర్ తెలిపారు. శివకుమార్ చేతుల మీదుగా ఈ సహాయాన్ని గురువారం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ బళ్ల శ్రీనివాస్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

అంబాజీపేట: ప్రస్తుత తరుణంలో సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సర్పంచ్‌ల సంఘం తమ వంతు కృషి చేయాలని శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. ఉమ్మడి తూర్పు జిల్లాల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలిగా నియమితులైన మాచవరం సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అభినందన సభ అంబాజీపేట వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో శుక్రవారం రాత్రి జిత్తుక ఆశీర్వాదం అధ్యక్షతన జరిగింది. పలువురు వక్తలు మాట్లాడుతూ కరోనా సమయంలో శాంతకుమారి, ఆమె భర్త సుబ్బారావు మానవత దృక్పథంతో ఎంతో మందికి సేవలు అందించి పేరు గాంచారన్నారు. తన మామ నాగాబత్తుల సాహెబ్ పేరు ట్రస్ట్ ఏర్పాటు చేసి మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేపట్టం అత్యంత అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. అనంతరం సర్పంచ్ శాంతకుమారి, సుబ్బారావు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, గణపతి వీరరాఘవులు, బొంతు పెదబాబు, రవణం రాము, నెల్లి వెంకటరమణ, అరిగెల బలరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చోరీకి విఫల యత్నం

ముమ్మిడివరం: మండలంలోని కొత్తలంక గ్రామంలో దొంగలు పడి చిన్న చిన్న షాపులలో నగదు అపహరించుకు పోతున్నారు. ఈ నెల 12న రెడ్డిపల్లంశెట్టికి చెందిన కాఫీ హోటల్‌లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి రూ.30 వేలు నగదు అపహరించుకుపోయారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు దొంగల ఆచూకీ లభ్యం కాలేదు. మళ్లీ గురువారం రాత్రి అదే షాపులో దొంగతనం చేసేందుకు విఫలయత్నం చేశారు. గునపం, ఇనుపరాడ్డుతో షాపు తలుపులు తెరిచేందుకు విఫలయత్నం చేశారు. అక్కడ ఆగంతకులు తాగి పడేసిన మద్యం సీసాలు కూడా ఉన్నాయి. కొత్తలంక పరిసర ప్రాంతాల్లో కొంతకాలంగా దొంగతనాలు జరుగుతున్నాయని, దీనిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బాధితులకు చేయూత



ప్రమాద బాధితులకు సాయం అందజేస్తున్న సమితి సభ్యులు

రావులపాలెం: ప్రమాదాల్లో గాయపడిన తండ్రీకూతుళ్ల చికిత్సకు స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు శుక్రవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన షేక్ హమధునిస్స శరీరంపై కళాశాల ల్యాబ్‌లో ప్రమాదవశాత్తూ యాసిడ్ పడింది. ఆమెకు ఆపరేషన్ చేయాల్సి ఉంది. అలాగే ఆమె తండ్రి షేక్ ఖాదర్ బాబు కాలిపై ఇటీవల ఇన్వర్టర్ బ్యాటరీ పడి, గాయమైంది. అతడికి సర్జరీ చేయాలని వైద్యులు సూచించారు. ఈ నేపథ్యంలో వైద్య ఖర్చుల కోసం సమితిని వారు సాయం కోరారు.

రైతు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి

రాజోలు: ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు సంక్షేమ పథకాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని రాజోలు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుబ్బల రోజా రమణి అన్నారు. శుక్రవారం తాటిపాకలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో 2034–24 ఏడాదికి సంబంధించి మార్కెట్ సెస్ వసూలు, ఆదాయ వనరులపై చర్చించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ రోజారమణి మాట్లాడుతూ రైతులకు గ్రామాల్లో అన్ని రకాల సేవలు అందించేందుకు ఆర్బీకేలు అందుబాటులో ఉన్నాయన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుంకర వెంకట సత్యప్రసాద్ (బాబ్జి), కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు జి.ప్రదీప్, టి.భాస్కరరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని ముస్లింల ప్రార్థనలు

కొత్తపేట: వర్షాలు కురవాలని అల్లాను కోరుతూ కొత్తపేటలో ముస్లింలు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ముస్లింలకు ప్రత్యేక దినమైన శుక్రవారం పురస్కరించుకుని స్థానిక కమ్మిరెడ్డిపాలెం జామియా మసీదులో మసీదు, షాదీఖానా కమిటీ అధ్యక్షుడు షేక్ కాజాబాబు ఆధ్వర్యంలో వర్షాలు కోసం ముస్లింలు ప్రత్యేక పార్థనలు జరిపారు. మృగశిర కార్తె ప్రవేశించి పది రోజులు కావస్తున్నా వర్షాలు కురవకుండా ఇంకా వడగాడ్పులు కొనసాగడంతో ప్రజలు అల్లాడిపోతున్నారని, వాతావరణం చల్లబడాలని, వర్షాలు కురవాలని అల్లాను ప్రార్థించారు. వెంటనే వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, రైతులు ఆర్థికంగా వృద్ధి చెందాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని అల్లాను ప్రార్థించారు.

బాల్య దశలోనే వ్యక్తిత్వ వికాసం

అంబాజీపేట: బాల్య దశలో కలిగించే ప్రేరణలే మనిషి వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడతాయని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.రమాదేవి అన్నారు. మొసలపల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలో జన్ భాగీదారీ కార్యక్రమాన్ని శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ఆట పాటలతో చిన్నారులకు మేధస్సు పెరుగుతుందని తల్లిదండ్రులకు పిల్లలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశాలు, హెల్త్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యాధికారి అందుబాటులో ఉండటం లేదు

అంబాజీపేట: పశువులకు ఏ రోగమొచ్చిన పుల్లేటికుర్రు పశువైద్యాశాలకు తీసుకువెళ్లితే అక్కడ పశువైద్యాధికారి ఏ సమయంలోను అందుబాటులో ఉండటం లేదని స్థానిక సర్పంచ్ జల్లి బాలరాజు, ఎంపీటీసీ పబ్బినీడి రాంబాబులు అధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. వైద్యాధికారి ఇక్కడ విధులు నిర్వహించకుండా ఇన్‌చార్జి పేరుతో ముక్కామలలో ఉంటున్నారని చెబుతున్నారని అక్కడకు వెళ్లినా రైతులకు అందుబాటులో ఉండటం లేదన్నారు. పశువులకు ఏ వైద్య పరీక్షలు చేయించాల్సి వచ్చినా అంబాజీపేట పశువైద్యశాలకు తీసుకువస్తున్నామని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, పశువైద్యాధికారి రాజేంద్రప్రసాద్‌కు వివరించారు. రైతులకు ఎల్లవేళలా పశువైద్యాధికారి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

భర్త, అత్తలపై కేసు

అంబాజీపేట: అదనపు కట్నం తీసుకురావాలని తన భర్త, అత్తల వేధింపులు తాళలేక వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ జేజీఎస్ వరప్రసాద్ తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. 9 ఏళ్ల క్రితం అద్దంకివారిలంకకు చెందిన దాకే నాగేశ్వరరావుతో నాగలక్ష్మికి వివాహం జరిగింది. కొన్ని నెలలుగా నాగలక్ష్మిని అదనపు కట్నం తీసుకురావాలని ఆమె భర్త నాగేశ్వరరావు, అత్త సూర్యకాంతం చిత్రహింసలకు గురి చేస్తున్నారన్నారు. భర్త, అత్త వేదింపులు తాళ్ల లేక మే నెలలో నాగలక్ష్మి పుట్టిల్లు పుల్లేటికుర్రుకు వచ్చేసిందన్నారు. తన భర్త నాగేశ్వరరావు ఈ నెల 15వ తేదీన పుల్లేటికుర్రు వచ్చి ఆమె తల్లిని కాళ్లపై కొట్టి గాయపరిచాడన్నారు. నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.